క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుక్కుగూడ: కందుకూరు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు నూతనంగా విద్యుత్ లైన్ వేస్తున్న కారణంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ చక్రపాణి తెలిపారు. ప్లాస్టిక్ పార్క్, మంఖాల్ పారిశ్రామికవాడ, ఫ్యాబ్ సిటీ, రాంకీ, కావూరి హిల్స్, విశాల్, ప్రజయ్, ఇమామ్‌గూడ, రాచూలూరుగేట్, పెద్దమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం

కందుకూరు: కందుకూరు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు లైన్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉండదని రైతులు సహకరించాలని ఆయన కోరారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



ఆసిఫ్‌జానికి సీఐ చేతుల మీదుగా జ్ఞాపికను బహూకరిస్తున్న భక్తులు

కందుకూరు: వీరహనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రానికి ర్యాలీగా వచ్చిన భక్తులకు.. ముస్లిం యువకుడు ఆసిఫ్ జాని ఆధ్వర్యంలో శీతల పానియాలు పంపిణీ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. దీంతో అతడిని సీఐ సీతారామ్, భక్తులు సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఎండీ సల్మాన్, ఎండీ పర్వేజ్, ఎండీ అజీజ్, ఎండీ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న సిబ్బంది

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ శ్రీ త్రివేణి పాఠశాల ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ డా.హేమా ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు సమాజంలోని మంచి, చెడులను గుర్తించే నైపుణ్యాలను తెలిపే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కరెస్పాండెంట్ సునీల్, ప్రిన్సిపాల్ యోగేశ్వరి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

సూపర్‌వైజర్ కళావతి

షాబాద్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని నాగర్‌గూడ అంగన్‌వాడీ టీచర్ అంబుజాక్షి, సూపర్‌వైజర్ కళావతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులకు రక్తహీనత అనేది ప్రధాన సమస్య అని, దానిని పోషకాహారం ద్వారానే ఎదుర్కోగలమని తెలిపారు. గర్భిణులు సక్రమంగా పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జంగమ్మ, స్వరూపారాణి, ఆయా సంతోష ఉన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్స్ అందజేత

మొయినాబాద్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు యునైటెడ్ వే ఆఫ్ హైదారాబాద్ ఆకృతి సంస్థ ల్యాప్‌టాప్స్ అందజేసింది. శనివారం పాఠశాలకు వచ్చిన సంస్థ ప్రతినిధులు ఆరు ల్యాప్‌టాప్‌లను అందించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించేందుకు వాటిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వినోద, సంస్థ ప్రతినిధులు అస్మా, సయ్యద్ ఆరీఫుద్దీన్, రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు సుజాత, స్వర్ణలత, రవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: రావిర్యాలలో ర్యాలీలో పాల్గొన్న భక్తులు



హుడాకాంప్లెక్స్: భక్తులకు స్వాగతం పలుకుతున్న ఎంపీ ఈటల

జైబోలో హనుమాన్‌కీ..

రామలక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ అంటూ భక్తుల నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. కాషాయ జెండాలతో కళకళలాడాయి. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గంలోని హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర ప్రారంభించారు. గ్రామాల్లోని పురవీధుల్లో కొనసాగిన శోభాయాత్రలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు కాషాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు



బడంగ్‌పేట్: పూజలు చేస్తున్న మాజీ మేయర్ పారిజాత, కార్పొరేటర్లు



కందుకూరు: శోభాయాత్రలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: వీరహనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా ఆయన తండ్రి జనార్దన్‌గుప్తా జ్ఞాపకార్థం హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులతో కలిసి భక్తులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, కుంచకూరి సత్యనారాయణగుప్తా, మీగడి రవీందర్, నల్లబోలు నర్సింహారెడ్డి, ఎడ్ల మహేందర్, శోభరామ్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామ శివారులోని అనుబంధ గ్రామమైన అవాజ్‌మీయా పడకల్‌లో శుక్రవారం రాత్రి వానరాశి జంగయ్య మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన నారాయణ రూ.5వేల చొప్పున, కుర్వగూడెం నర్సింలు రూ.3వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అబ్బి సుందరయ్య, సూరమోని యాదయ్య పాల్గొన్నారు.

సనాతన ధర్మరక్షణకు కృషి చేయాలి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కమలానంద భారతి స్వామిజీ

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని రక్షించాలని కమలానంద భారతి స్వామిజీ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయం వద్ద బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు భ్యారీ బైక్ ర్యాలీలతో విచ్చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ అరికట్టాలన్నారు. హిందూ అమ్మాయిలపై లవ్ జీహాది సంఘటనలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టి అమ్మాయిలను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. హిందూ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. హిందు ఆలయాల రక్షణకు ప్రభుత్వాలు పని చేయాలన్నారు. మత మార్పిడిలను ప్రతి ఒక్కరూ అరికట్టాలన్నారు. అంతకు ముందు మండలంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, అమీర్‌పేట్, నాగారం, సిరిగిరిపురం, తుమ్మలూరు గ్రామాల నుంచి యువకులు మండల కేంద్రంలో ఉన్న శివగంగ ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ సీనియర్ నాయకుడు చింతల వెంకన్న, బూర్గు రమణ, జిల్లా అధ్యక్షుడు సోకుంట్ల శ్రీనివాస్, కార్యదర్శి మండల రాజు, జిల్లా సంయోజక్ ఎర్ర రాఘవేందర్, నాయకులు శివకుమార్, ఈశ్వర్, రమేశ్, మహేశ్, శ్రీనివాస్, రాఘవేందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవించి, ఆయన ఆశయ సాధనకు బీజేపీ కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం పరిసర ప్రాంతంలో స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహాల పరిసరాలను శుభ్రం చేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగానే చేవెళ్లలో ఈ కార్యకమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌పై కపట ప్రేమను చూపిస్తోందన్నారు. ఆయనను ఆనాడు అవమానించింది ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. పేద ప్రజలకోసం ఎంతో శ్రమించిన అంబేడ్కర్ ఆశయాలను బీజేపీ దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, పార్టీ నాయకులు శ్రీను, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, కృష్ణగౌడ్, మోహన్, శ్రీకాంత్, అభి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీను, శేఖర్, మధూకర్, శ్రీనివాస్‌రెడ్డి, జయసింహ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కందుకూరు: మండల పరిధి లేమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి ఏ.అభిషేక్‌రెడ్డి, విశ్రాంత జడ్జి సీవీ నాగార్జున్‌రెడ్డి, ప్రణాళికా బోర్డు రాష్ట్ర వైస్ చైర్మన్ జి.చెన్నారెడ్డి, గుంటూరు జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నర్సింగ్‌రావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జలనారాయణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు కొండారెడ్డి, వైస్ చైర్మన్ రాంప్రతాప్‌రెడ్డి, గజాడి మల్లేశ్, బాలకృష్ణ, ఐలయ్య, గుల్వి జైపాల్, రాఘవేందర్, భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీపెద్దమ్మతల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, బంజార సేన రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల ప్రవీణ్‌నాయక్, మాజీ సర్పంచ్ జర్పుల రజిత దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కాగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ట్రైకార్ చైర్మన్ శ్రీరామచంద్రనాయక్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్, కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్, నాయకులు లక్పతి నాయక్, నాగరాజు, శ్రీను, శ్రీరామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సన్నబియ్యంతో వండిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని అంబేడ్కర్ కాలనీలో కందాడ మానిక్యం ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి ఆయన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా వారిని బియ్యం ఎలా ఉన్నాయి.. తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపేందుకు ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వారి సమస్యలపై స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, నాయకులు వీరేందర్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, బి.రాములు, ఆగిరెడ్డి, గంగి యాదయ్య, టీకుపల్లి శ్రీను, జి.రాములు, భీమయ్య, లక్ష్మారెడ్డి, ఎం.శ్రీనివాస్, దయాకర్, సుశాంత్ తదితరులు ఉన్నారు.